కథా నిలయం
1059
శ్రీకాకుళం

# తన సంకెళ్ళు తానే బిగించుకుంది

రమకు రాకూడని కష్టం వచ్చింది చిన్న వయస్సులోనే.

రమ భర్త మిట్టమధ్యాహ్నం స్కూటరు మీద వస్తూ ఎదురుగా వచ్చే లారీని చూసాడు. లారీ బాగా లోడ్‌తో వున్నది. లారీ డ్రైవరు రోడ్డు దిగి ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇచ్చేటట్లుగా లేడు. రోడ్డేమో చాలా చిన్నగా వుంది. వెడల్పు తక్కువ. అది ఎండాకాలం. ఒక్కపూట స్కూలు వదిలాక రమ భర్త శంకర్ స్కూలు నుంచి వస్తున్నాడు. మిట్ట మధ్యాహ్నపు మిరుమిట్లు గొల్పే సూర్యుని కిరణాల వెలుతురుకు అతని కళ్ళు జిగేల్‌మన్నాయి. లారీ డ్రైవరు వీసమంతయినా రోడ్డు మీది నుంచి దిగి దారి ఇచ్చేట్లు లేడని గ్రహించి శంకర్ స్కూటరును రోడ్డు కిందికి తోలాడు. అంతే ఏమైందో స్కూటరు అతని అదుపు తప్పింది. పోయి చెట్టుకు గుద్దుకుంది. స్కూటరు మీది నుంచి కిందపడిన శంకర్ తల అక్కడే వున్న బండరాయి మీద పడి పగిలిపోయింది. రక్తం ధార కట్టింది. శంకర్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు.

రమ భర్త శంకర్ రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని నాకు చాలా రోజులకు తెలిసింది. మా ఇద్దరికీ స్నేహితురాలు సావిత్రి రమ వుండే ఊర్లోనే వుంటుంది. ఆమె ఉత్తరం వ్రాస్తే నాకు తెలిసింది.

"పాపం రమ!" అనుకున్నాను నేను. నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

వెంటనే వెళ్ళి రమ దుఃఖంలో పాలు పంచుకోవాలనిపించింది నాకు. ఒక్కదాన్నే బస్సులో బయలుదేరాను. రమ ఇల్లు నాకు తెలుసు. బస్సు దిగి చక్కంగా రమ ఇంటికి వెళ్ళాను అప్పటికే రమ భర్త చనిపోయి నెలరోజులయింది.

నేను ఇంట్లోకి వెళ్ళి ముందున్న చిన్న హాల్లో నిలబడ్డాను. రమ నాకెక్కడా కన్పించలేదు.

కొందరు పిల్లలు హాల్లో క్యారమ్స్ ఆడుకుంటున్నారు. మరికొందరు పిల్లలు అటుయిటు పరిగెత్తుతున్నారు. హాలంతా గోలగోలగా వుంది. ఆ పిల్లల్లో రమ ఇద్దరు పిల్లలెవరో నేను గుర్తించలేకపోయాను. ఎండాకాలం సెలవులు గదా పక్కింటి పిల్లలు ఆడుకోడానికి వచ్చారేమో అనుకున్నాన్నేను.

నేను కాస్సేపాగి అటు యిటు చూసాను. ఇంతలో ఒకావిడ పైటకొంగుకు చేతులు తుడుచుకుంటూ హాల్లోకి వస్తూ కన్పించింది.

"రమ ఏదండి?" అడిగాను.

పక్కనున్న గదివైపు చూపించింది ఆమె. గది తలుపులు దగ్గరేసి వున్నాయి. నేను గది తలుపులు తోసుకొని లోపలికెళ్ళాను. గదంతా చీకటిగా వుంది. నేను గదంతా కలయ జూసాను. గదికున్న ఒక్క కిటికీ మూసి వుంది. నేను చక్కంగా పోయి కిటికీ తెరిచాను. గది లోకి వెలుతురు వచ్చింది. దాంతోపాటు చల్లనిగాలి ప్రవేశించింది. గోడ దగ్గరగా వేసివున్న మంచంలో తెల్లబట్టల మూటలాగా ముడుచుకొనిపోయి పడుకొని వున్న రమ కన్పించింది.

"రమా!" అని పిల్చాను.

నా గొంతు గుర్తుపట్టిందేమో రమ. తల పైకెత్తి చూసింది.

"నువ్వా ! విమలా చూసావా? ఎంత పనయిందో!" అని రమ మంచంలోనే మళ్ళా ముడుచుకొనిపోయి వెక్కివెక్కి ఏడ్వడం మొదలుపెట్టింది.

నేను మంచం మీద రమకు దగ్గరగా వెళ్లి కూర్చున్నాను. నా రెండు చేతుల్తో ఆమెను కావలించుకున్నాను. రమను లేబట్టి కూర్చోబెట్టాను. రమ మంచంలో మూటలాగా కూర్చుంది. ఆమె ముఖం వక్షస్థలంలోకి దూరిపోయింది. నా ఎడమచేత్తో రమను పొదివి పట్టుకొని కుడి చేతి మునివేళ్ళతో ఆమె ముఖాన్ని పైకెత్తాను. రమ ముఖమంతా ఏడ్చిఏడ్చి ఎర్రబడింది. ఉబ్బిపోయి వుంది. వెంట్రుకలన్నీ దువ్వెన తగిలి ఎన్నాళ్ళయిందో పీచుపీచు అయి చెల్లాచెదరై వున్నాయి. తెల్ల జాకెట్టు తెల్లచీర. నొసట మీద బొట్టు లేదు. బొట్టు వుండే చోట స్టిక్కరు పెట్టుకోవడం వల్లనేమో తెల్లని మచ్చ ఏర్పడింది. చేతులకు రంగురంగుల మట్టిగాజుల స్థానంలో మెరుస్తూ బంగారు గాజులు కన్పించాయి. "అవి రోల్డుగోల్డేమో అందుకే బాగా జిగేలుమంటూ మెరుస్తున్నాయి" అనుకున్నాను.

ఆ రూపంలో రమను చూసేసరికి నాకు దు:ఖం ఉప్పొంగుకొని వచ్చింది. నా దు:ఖాన్ని ఆపుకొని "ఊరుకో రమ! నీకు రాకూడని కష్టం వచ్చింది. నాకు తెలుసు! అయినా ధైర్యం తెచ్చుకోవాలి. నిన్ను నువ్వు సంబాళించుకోవాలి." అన్నాను నేను.

కాస్సేపటికి రమ ఏడ్పు ఆపింది. నేను ఆమె వీపును చేతితో నిమురుతూ "ఎట్లా జరిగిందే ప్రమాదం?" అడిగాను.

రమ భర్త స్కూటరు ప్రమాదం గురించి చెప్పింది. అంతా రమ నోటి నుంచి విన్నాక నాకూ దు:ఖం ఆగలేదు. ఇద్దరమూ కాస్సేపు నిశ్శబ్దంగా వుండిపోయాం. నేను తేరుకొని -

"ఇంట్లో ఎవరే చాలామంది పిల్లలు కన్పించారు?" అడిగాను.

"వాళ్ళంతా మా ఆడపడుచుల, మరుదుల పిల్లలు. ప్రమాదం గురించి తెలియగానే అందరూ వచ్చారు" అంది రమ సన్నని గొంతుతో.

"అందరూ వచ్చారు బాగానే వుంది! నెలరోజులయింది గదా ఇంకా వాళ్ళు వెళ్ళిపోలేదా?" అడిగాను.

రమ మెతకదనం గురించి నాకు స్కూల్లో చదువుకుంటున్నప్పట్నుంచి తెలుసు. ఇంట్లో వాళ్ళకు గాని స్కూల్లో టీచర్లకు గాని నోరు విప్పి ఏదైనా సమాధానం చెప్పాలంటే దానికి తెగని భయం. ఏమంటే ఎవరేమనుకుంటారేమో అని జంకు. అందుకే మా స్నేహితుల గుంపులో దాని గొంతు చాలా తక్కువగానే వినిపించేది. ఆ గుంపులో నాకు వాగుడుకాయ అని పేరు. అట్లా విరుద్ధ ధ్రువాలయినా మేం బాగా స్నేహితులమయ్యాం. అది మా యింటికి రావడం నేను వాళ్ళింటికి వెళ్ళడం జరిగేది. రమ పెళ్ళి మా అందరిలో ముందుగా ఇంటర్ పరీక్షలు కాగానే అయింది. ఎండాకాలం సెలవల్లో అయినా దాని పెళ్ళికి నేను వెళ్ళాను. అందరు ఊర్లకు వెళ్ళిపోవడంతో మా స్నేహితుల తరపున నేనొక్కదాన్నే అయ్యాను. దాని చిన్నాయన చూసిన సంబంధాన్ని మెడలు వంచుకొని చేసుకుంది రమ. శంకర్ మంచివాడే. రమను బాగానే చూసుకునేవాడని తర్వాత నాకు తెలిసింది. రమ మెతకదనానికి దాన్ని బాగా చూసుకునేవాడు దొరికాడని నేను సంతోషించాను కూడా.

నేనడిగిన ప్రశ్నకు రమ సమాధానం చెప్పడానికి వెనుక ముందాడుతూ అంది.

"ఇప్పుడు సెలవులు గదనే! వచ్చినవాళ్ళం దూరభారమనకుండా వచ్చాం" - అన్నారు. నీకు తెలుసుగదనే ఒక ఆడపడుచు భోపాల్‌లో వుంటుంది. మరో ఆవిడ బొంబాయిలో వుంటుంది. ఓ మరిది చాందాలో వుంటాడు. మరో ఆయన ఢిల్లీలో వుంటాడు. పిల్లల సెలవులయ్యే దాకా వుంటామని వున్నారు"

"అదేమిటే! ఒకవైపు నువ్వు మీ ఆయన పోయిన దు:ఖంలో వున్నావు. ఇంతమంది ఇంటి మీద పడితే రోజు ఖర్చు! వంటలు వార్పులు ఎట్లా కావాలి! ఆ ఆలోచన వాళ్ళకు లేదా?" ఆశ్చర్య పోయాను నేను.

"వంట వార్పులు వాళ్ళే చేసుకుంటున్నారు. ఖర్చులు! అవేమో స్కూలువాళ్ళు వచ్చి ఆయన నెలజీతం ఇచ్చివెళ్ళారు. పోస్టాఫీసులో కొంత సేవింగ్సువున్నాయి. ఇకపోతే మా మరిదే ఒకరు వెళ్ళి పోలీసు దగ్గర నుంచి ఆయన స్కూటరు తెచ్చారు. అది అమ్మేస్తానంటే నేను సరేనన్నాను. ఆయన లేకపోయినాక స్కూటరెందుకు చెప్పు! విమలా!" అంది రమ ఏడుస్తూ.

నేను రమ ముఖాన్ని నా వక్షస్థలానికి చేర్చుకున్నాను.

"అయితే ఆ స్కూటరమ్మిన డబ్బు కూడా ఇంటి ఖర్చులకే పెట్టారన్నమాట!" అన్నాను.

అవునన్నట్లుగా తలూపింది రమ.

"రమా! ఇట్లా నువ్వు మంచంపడ్తే పైసా మిగిలించకుండా ఖర్చుపెట్టి వెళ్ళిపోతారు మీ వాళ్ళు" నేనన్నాను.

"విమలా! అదికాదే! కర్మకాండ ఘనంగా జరిపించాలన్నారు. వాళ్ళే నిలబడి చేసారంతా. నా చేతనయ్యేదా? చెప్పు! అదంతా!" అంది రమ నిస్పృహాయంగా కన్నీళ్ళు కారుస్తూ.

"నిలబడి చేసారు. బాగానే వుంది. కాని డబ్బు ఎవ్వరిదే! అయినా కర్మకాండ ఘనంగా జరిపించి పదిమందికి భోజనాలు పెడ్తే నీ పిల్లలేమౌతారని ఆలోచించావా! నీవేం అయిపోతా వని చూసుకున్నావా! సరే! కర్మకాండ అయిపోయి చాన్నాళ్ళయింది. వాళ్ళు ఇక్కడే వుండిపోతే ఖర్చు తక్కువవుతుందా? నీ భవిష్యత్తు గురించి నీ పిల్లల భవిష్యత్తు గురించి నువ్వు ఆలోచించుకోవాలి! వాళ్ళేమైనా వచ్చి ఆదుకుంటారా? అందులో దూరంగా ఎక్కడో వున్నవాళ్ళు నిన్నేం ఆదుకుంటారు?" అన్నాను.

"వెళ్ళిపొమ్మని నేనెట్లా చెప్పనే!" ఏడ్చింది రమ.

"సరే! ఒక పని చేస్తాను. నిన్ను నీ పిల్లల్ని నా దగ్గరికి - రేపే నా దగ్గరికి తీసుకెళ్తాను. అదే వాళ్ళకు చెప్తాను. అప్పుడు వాళ్ళే వెళ్ళిపోతారు" అన్నాను.

రమకు చిన్ననాడే తలిదండ్రులు రైలు ప్రమాదంలో చనిపోయారు. అనాథ అయిన రమను ఆమె చిన్నాయన చేరదీసాడు. ఆమె తండ్రి గ్రాట్యుటీ పెన్షన్ డబ్బు పెట్టి ఆమెను పెంచాడు. చదివించాడు. పెళ్ళి చేసి తన బాధ్యత వదిలించుకున్నాడు. అట్లా రమ ఇప్పుడు వెనుకా ముందూ ఎవరూ లేకుండా అయిపోయింది.

నేను వేసిన పాచిక పారింది.

"రమను పిల్లల్ని నేను తీసుకెళ్తున్నాను. కొన్నాళ్ళపాటు నా దగ్గర వుంటారు" అని వాళ్ళతో చెప్పాను.

వెంటనే వాళ్ళంతా మూటలు సర్దేశారు. రెండు రోజుల్లో అంతా వెళ్ళిపోయారు.

"రమా! నువ్వు యీ విధంగా మంచం పడ్తే లాభం లేదే. లే! లేచి నీ ఇల్లు పిల్లల్ని చూసుకోకపోతే ఎట్లా. పోయినవాళ్ళు పోయారు. వున్నవాళ్ళ బాగోగులు నువ్వు చూసుకోవాలి! అటు పిల్లల్ని చూడు! ఎట్లా బెంగపడిపోయారో! స్కూళ్ళు తెరిచేదాకనయినా వాళ్ళు ఇంటిపట్టున వుండేటట్లు చూసుకో! తర్వాత స్కూళ్ళు చదువులు చూసుకోవాలి! ఇవన్నీ నువ్వు పట్టించు కోకపోతే వాళ్ళేమైపోతారో ఆలోచించు! రమా!" అన్నాను.

కష్టంగా రమను మంచంలోంచి లేపాను. గదిలో నుంచి కదిలించాను. ధైర్యం

చెప్పాను. రమను తీసుకొని నేను శంకర్ పనిచేసిన స్కూలుకు వెళ్ళాను. ఆ స్కూలు హెడ్ మాస్టరు రమ రాకకోసం ఎదురు చూస్తున్నట్లుగానే ఆమెను చూడగానే కూర్చోబెట్టి మాట్లాడాడు. రమ ఇంటర్ చదివింది కాబట్టి ప్రైమరీ సెక్షన్లకు టీచరుగా ఉద్యోగం ఇయ్యడానికి మానేజిమెంటు ఒప్పుకుందని చెప్పాడు.

"మిసెస్ శంకర్! మీరు టీచర్స్ ట్రెయినింగు చేస్తే క్రమంగా మీ జీతం పెంచుతారు. ఇప్పుడైతే సెలవులు కాగానే వచ్చి జాయిన్ అయిపొండి!" అన్నాడు స్కూలు హెడ్‌మాస్టరు.

శంకర్ స్కూల్లో నిజాయితీగా పనిచేసే టీచరుగా గుర్తింపు పొందాడు. కాబట్టి మానేజిమెంటు అతని హఠాన్మరణానికి సానుభూతి ప్రకటించింది. వెంటనే రమకు ఉద్యోగం కూడా ఇయ్యడానికి సిద్ధమైంది. శంకర్‌కు రావలసిన గ్రాట్యుటీ డబ్బు వగైరా వెంటనే రమకు అందజేస్తామని చెప్పాడు హెడ్‌మాస్టరు.

ఇంటికి వచ్చింతర్వాత రమ దు:ఖం చింతలకు కాస్త దూరమైనట్లుగా గమనించాను నేను. ముందు చేయవలసిన బాధ్యతలెన్నో ఆమె మనస్సులో మెదిలి భర్త మరణించిన విషాదాన్ని మరిచిపోగలిగింది. రెండు రోజుల్లోనే కాస్త కోలుకొని ఇల్లునూ పిల్లల్ని చూసుకోవడం మొదలుపెట్టింది.

"రమా! నాలుగు రోజులు నువ్వూ పిల్లలూ మా ఇంటికి రండి. నీకు కాస్త మార్పుగా కూడా వుంటుంది" అన్నాను నేను.

"విమలా! నేనూ పిల్లలు తప్పకుండా ఓసారి మీ ఇంటికి వస్తాం. కాని ఇప్పుడు కాదు. ఎందుకో ఇప్పుడీ ఇల్లు విడిచిపెట్టి నాకు ఎక్కడికీ వెళ్ళాలని లేదు. ఏమనుకోకే!" అంది రమ.

"సరే! అట్లాగే కానీ. అప్పుడప్పుడు మీ క్షేమ సమాచారాలు తెలుపుతూ నాకు ఉత్తరం రాస్తుండు" అని రమకు చెప్పి నేను మా ఊరికి వెళ్ళాను.

అట్లాగే రమ తను పిల్లలు ఎట్లా వున్నారో తన ఉద్యోగమెట్లా వుందో ఉత్తరాలు వ్రాసింది. నేను జవాబులు వ్రాసాను. అట్లా కొన్నాళ్ళు మామధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. ఆ తర్వాత మెలమెల్లగా ఉత్తరాలు వ్రాసుకోవడం తగ్గింది. కొన్నాళ్ళకు పూర్తిగా బందయింది.

నాలుగేళ్ళ తర్వాతనో యేమో నేను మావారు మా బావగారి కూతురు పెళ్ళికి భూపాల్ వెళ్ళాం. పెళ్ళయింతర్వాత పెళ్ళికూతురుతో తోడుగా అత్తవారింటికి ఎవరు వెళ్తారని మా తోటికోడలు అటు యిటు చూసి

"విమలా! నువ్వు వెళ్ళవే" అంది. సరేనని బయలుదేరాను. పెళ్ళికొడుకు వుండేది భూపాల్ లోనే. సాయంత్రం పెళ్ళికొడుకు ఇంటికి వెళ్ళాం. మేము వెళ్ళగానే కొందరు ఆడవాళ్ళు. వయస్సులో వున్న ఆడపిల్లలు పెళ్ళికొడుకు పెళ్ళికూతురును గృహప్రవేశం చేయించే తంతును

కోలాహలంతో సాగించారు. పెళ్ళయిన జంట ద్వారం బయటే నిలబడ్డారు. ఒకరిపేరు ఒకరు చెప్పందే లోపలికి వెళ్ళనియ్య మంటున్నారు. వాళ్ళేమో చెప్పడానికి బెట్టు చేస్తున్నారు. ఇదంతా జరుగుతుంటే నేను నాతో వచ్చిన మా ఆడపడుచు వాళ్ళను వాళ్ళ సరదాకు వదిలేసి తప్పించు కొని లోపలికి వెళ్ళాం. లోపలి కెళ్ళగానే దూరంగా ఓ మూల ఒదిగిపోయి నిలబడి నాకు రమ కన్పించింది. నొసట బొట్టు లేదు. తెల్లజాకెట్టు తెల్ల చీరలో చిక్కిపోయి కన్పించింది. చాలా ముసలిది అయినట్లుగా అనిపించింది. ఆమెలో దైన్యం కూడుకట్టుకొని వుంది. అసలు రమను నేను చూడగానే కాస్సేపు గుర్తుపట్టలేక పోయాను కూడా. అంతగా మారిపోయింది.

రమ నేను కలిసి స్కూలుకు, కాలేజికి వెళ్ళాం. చాలా స్నేహంగా వుండేవాళ్ళం. మా మధ్య ఏ దాపరికాలుండేయి కావు. అంత సన్నిహితంగా వుండేవాళ్ళం. అటువంటి రమను నేను దాదాపు నాలుగేళ్ళ తర్వాత చూసి గుర్తుపట్టలేకపోయానంటే నామీద నాకే ఆశ్చర్యమేసింది. అది నా తప్పు కాదు. రమ మునుపటికన్నా చాలా మారిపోయింది. మానసికంగా శారీరకంగా కుంగిపోయినట్లుగా కన్పిస్తున్నది. ఆమెలో మునుపటి కళే లేదు!

రమను గుర్తుపట్టాక నేను దాని దగ్గరికి వెళ్ళాను. "రమా! నువ్విక్కడ?-" అన్నాను.

"పెళ్ళి కొడుకు మా ఆడపడుచు కొడుకే" అంది రమ.

"మరి పెళ్ళిలో కనపడలేదు నువ్వు" అడిగాను.

"పెళ్ళంటే శుభకార్యం కదనే. నావంటి పసుపుకుంకుమలు లేనిది అక్కడికి వస్తే ఏం బాగుంటుంది చెప్పు! అదీగాక నలుగురేమనుకుంటారు" అంది రమ ముఖం వంచుకొని.

"నలుగురేమనుకుంటారని రాలేదా? లేక నీకు నువ్వే నా వంటిదానికి అక్కడేం పని అని రాలేదా? అయినా ఆ నలుగురెవరు?" అడిగాను నేను.

"అదికాదే! ఎవ్వరేమనుకున్నా లేకపోయినా నా వంటిది పెళ్ళిలో కన్పిస్తే ఏం బాగుం టుంది చెప్పు!" అంది ముఖం పైకెత్తి దీనంగా చూస్తూ.

"ఎందుకు రమా! నిన్ను నువ్వు యీ విధంగా బాధించుకుంటున్నావు! ఇటు రా ! పెళ్ళికొడుకు పెళ్ళికూతురు గృహప్రవేశం జరుగుతున్నది చూద్దాం రా!" అని రమను నాతో లాక్కొని ప్రధాన ద్వారం దగ్గరికి వెళ్ళాను.

"అదేమిటే విమల! నువ్వెళ్ళు. నేనెందుకక్కడికి. నష్టజాతకురాల్ని! ముత్తయిదు వులుండే చోటికి నేనెందుకే" అంటూనే వుంది రమ. నా చేతిలో నుంచి తన చేతిని విడిపించు కోడానికి ప్రయత్నం చేస్తూనే వుంది. అయినా నేను దాని మాటలు విననట్లుగానే నటిస్తూ దాని చేతిని లాక్కుంటూ వెళ్ళాను.

ఇంకా ద్వారం దగ్గరే వున్నారు పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు. వాళ్ళనింకా లోపలికి రానియ్యడం లేదు. అందరూ ఆనందడోలికల్లో ఊగుతున్నారు. ఒకరితో ఒకరు పరిహాసాలు

పన్నీరు చల్లుకోవ డాలు జరుగుతున్నాయి. పెళ్ళిజంట ఒకరి పేరు ఒకరు చెప్పందే ఇంట్లోకి వదలమంటున్నారు. ఇంట్లోకి రానియ్యకుండా అడ్డంగా నిలబడ్డారు అందరు. భార్యాభర్తలు హాయిగా ఏ సిగ్గు లేకుండా పేర్లు పెట్టి పిల్చుకునే కాలం ఇది. అయినా పెళ్ళికొడుకు పెళ్ళి కూతురు ఒకరి పేరు ఒకరు చెప్పడం లేదు. ముసిముసి నవ్వులు నవ్వుతున్నారు. అక్కడ చుట్టూ చేరిన వాళ్ళు ఆటలు పట్టిస్తున్నారు.

నేను అదంతా చూస్తుండిపోయాను. కాస్సేపటికి చూస్తే నా పక్కన రమ లేదు. నేను రమను వెతుక్కుంటూ మళ్ళీ లోపలికి వెళ్ళాను.

"రమా! ఒక్కదానివే ఇక్కడున్నావేమిటే!" అన్నాను.

"వాళ్ళ కెదురుగా నేనుండడం బాగుండదనీ" అని నసిగింది రమ.

"రమ! నువ్వు అక్కడ వుండకూడదని ఎవరైనా అన్నారా? లేక ఇవన్నీ నీకు నువ్వే విధించు కుంటున్నావా?" అడిగాను.

"ఇటువంటి విషయాలు ఎవరు చెప్తారే? - నాకు తెలియదా?" అంది రమ.

"అయ్యో రమ! నీ భర్త చనిపోయినంత మాత్రాన నిన్ను నువ్వు ఇంతగా శిక్షించు కోవాలా? చెప్పు! బొట్టు గాజులు తీసేసి నిరలంకారంగా ఈ విధంగా దైన్యంగా వుండాలని ఎక్కడుంది? చెప్పు! ఈ తెల్లబట్ట లేమిటి? నీ కిష్టమైన రంగు బట్టలు వేసుకోవచ్చు గద! ఆ జుట్టు ఒళ్ళు అంతా ఏ సంరక్షణ లేక! - ఇదంతా ఎందుకు? చెప్పు! భర్త పోయినంతమాత్రాన ఒక స్త్రీ ఎప్పటికీ ఇట్లానే తయారవ్వాలా? చెప్పు!" తగ్గుస్వరంతోనే దృఢంగా కోప్పడుతూ అన్నాను నేను.

"నేను బొట్టు పెట్టుకొని గాజులు వేసుకొని రంగు చీరలు కట్టుకుంటె లోకమే మంటుందే చెప్పు!" అంది రమ. ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

"ఇంకా నువ్వు ఏడ్పు మానలేదన్నమాట! ఒక వ్యక్తి చాలా దగ్గరైన వ్యక్తి చనిపోతే ఎవరికైనా దు:ఖంగానే వుంటుంది. అది కాదనను నేను. కాని ఈ దు:ఖాగ్నిని ఆరనీయకుండా రాజేసుకుంటు ఎన్నాళ్ళుంటారు ఎవరైన! అసలు లోకం కన్నా ముందే నువ్వే - నీకు నువ్వే - యీ సంకెళ్ళను తగిలించు కుంటున్నావు! అది తెలుసా నీకు! నలుగురు ముత్తయిదువలున్న చోటికి రావడానికి జంకుతున్నావు. శుభకార్యంలో ముందు నిలబడడానికి సంకోచిస్తున్నావు! గోడల వెనుక గది మూలల్లో నక్కుతున్నావు! ఇదంతా నువ్వు నీకు విధించుకునే శిక్ష రమా! ఈ సంకెళ్ళను నీకు నువ్వే తెంపుకోవాలి! నీ జంకును చూసి లోకం నిన్ను ఇంకా బెదిరిస్తున్నది! అది తెలుసుకోక నువ్వే లోకం పేరుతో జంకుతున్నావు! - రమా! ఈ సంకెళ్ళను తెంపుకొని నీకు నువ్వే విధించుకునే శిక్ష నుంచి బయటికి రా!" అన్నాను నేను దృఢమైన కంఠస్వరంతో. రమ దు:స్థితిని చూసి నాలో కలిగిన ఆవేదన ఆవేశమే నన్నా విధంగా పలికించాయి.

రమ ఏం మాట్లాడకుండా తల ఒంచుకొని నిలబడిపోయింది. నేను రమ చేతిని పట్టుకొని  గదిలో నుంచి బయటికి ప్రధాన ద్వారం వైపు లాక్కెళ్ళాను.

పెళ్ళికొడుకు పెళ్ళికూతురు పేర్లు చెప్పే తతంగం అయిపోయినట్లుగా వుంది. వాళ్ళు లోపలికి వస్తున్నారు. అందమైన అలంకరణలతో వున్న యువతి పెళ్ళికొడుకు అక్కయేమో మంగళారతి పట్టుకొని ముందు నడుస్తున్నది. ఆ మంగళారతి పళ్ళెంలోని కుంకుమభరిణ నుంచి కుంకుమను తీసి నేను రమ నొసట బొట్టు పెట్టాను. అక్కడ గుమిగూడిన ముత్తయిదువలు ఎవరూ దీన్ని చూసి ఏం పట్టించుకోలేదు. వాళ్ళ ఆనందకోలాహలంలో వాళ్ళున్నారు.

కుంకుమబొట్టుతో రమ ముఖం కళకళలాడింది. ఆమెలోని దైన్యం మాయమైంది. కుంగిపోయిన ఆమె శరీరంలో నవతేజస్సు ప్రవేశించింది. రమ ముఖం పైకెత్తి నావైపు చూసి చిరునవ్వు నవ్వింది. పెళ్ళికొడుకు పెళ్ళికూతురు వెంట అందరితో నేను రమ చేతిని పట్టుకొని ఇంట్లోకి వెళ్ళాను.

* * *